క్లుప్తంగా

వెయ్యి మొక్కలు నాటడమే ధ్యేయం



చాగలమర్రి టోల్‌ప్లాజా వద్ద మొక్క నాటుతున్న అధికారులు

చాగలమర్రి: కడప నుంచి కర్నూలు వరకు సుమారు వెయ్యి మొక్కలను నాటడమే ధ్యేయంగా పెట్టుకున్నామని టోల్‌ప్లాజా హెడ్ అరుణ్‌రాజ్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం లోని స్వచ్ఛ భారత్ మిషన్ ఇచ్చిన ఏక్ తారీఖ్ – ఏక్ ఘంటా అను నినాదంతో ఆదివారం చాగలమర్రిలోని టోల్‌ప్లాజా వద్ద నెషనల్ హైవే అథారిటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ నీరజ్ గుప్తా, టోల్ ప్లాజా ఆపరేషన్ హెడ్ మదన్ మోహన్, ఉద్యానవన శాఖ అధికారిణి నిహారికల ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్వచ్ఛ మిషన్ పచ్చదనం–పరిశుభ్రతపై సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.

స్వచ్ఛందంగా రక్తదానం చేయాలి

నంద్యాల టౌన్: రక్తదానంపై అపోహలు విడి ప్రజలు స్వచ్ఛంద రక్తదానానికి ముందుకు వచ్చి ప్రాణదాతలుగా నిలవాలని లయన్స్ క్లబ్ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, వైద్యులు వినోద్ కుమార్, అలీబాషా అన్నారు. ఆదివారం రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని నంద్యాల లయన్స్ క్లబ్, డాక్టర్ అలీబాషా ఆయుర్వేద పంచకర్మ, యోగా చికిత్సాలయం ఆధ్వర్యంలో, విజయ బ్లడ్ బ్యాంక్ సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. క్లబ్ జోనల్ చైర్మన్ చంద్రమోహన్, మేడా చంద్రశేఖర్ లతో పాటు మొత్తం 30 మంది రక్తదానం చేశారు.

నంద్యాల జిల్లా టైలర్స్ కమిటీ ఎన్నిక



సమావేశంలో టైలర్ల సంఘం నాయకులు

నంద్యాల(అర్బన్): నంద్యాల జిల్లా టైలర్స్ కమిటీ అధ్యక్షుడిగా డి.సుభాన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక కమిటీ కార్యాలయంలో ఆదివారం నంద్యాల జిల్లా టైలర్స్ కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఉమ్మడి కర్నూలు జిల్లా అధ్యక్షులు ఖలీల్ భాషా ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో నంద్యాల జిల్లా కమిటీ ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా సుభాన్, ఉపాధ్యక్షులుగా ఎల్లయ్య, అబ్దుల్‌ఖాదర్, ఖాజాహుసేన్, జనరల్ సెక్రటరీగా షేక్ హుసేన్, జాయింట్ సెక్రటరీగా ఖాన్, ట్రెజరర్‌గా ఖదీర్, అబ్దుల్లా, ప్రచార కార్యదర్శిగా అబ్దుల్‌సత్తార్ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వ్యక్తికి తేలు కాటు

రుద్రవరం: మండల పరిధిలోని మాచినేని పల్లె గ్రామానికి చెందిన శ్రీనివాసులు అనే వ్యక్తిని తేలు కాటు వేసింది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు దిన చర్యలో భాగంగా ఆదివారం అతను కల్లానికి వెళ్లి పశువుల కోసం గ్రాసం తీసుకువస్తుండగా గడ్డిలో ఉన్న తేలు కాటు వేసింది. అస్వస్థతకు గురైన శ్రీనివాసులును 108లో ముందుగా రుద్రవరం, అనంతరం ఆళ్లగడ్డ, నంద్యాల ప్రభుత్వ వైద్యశాలలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పడంతో కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

రంగస్థల కళాకారులు దరఖాస్తు చేసుకోండి

నంద్యాల(అర్బన్): జిల్లాలోని రంగస్థల కళాకారులు గుర్తింపు కార్డుల కోసం అక్టోబర్ 7వ తేదీ లోపు తమ దరఖాస్తులను నంద్యాల కార్యాలయంలో సమర్పించాలని రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ విజయకుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని కళాకారులకు కొత్తగా గుర్తింపు కార్డులు జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఈ మేరకు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో కళాకారులకు గుర్తింపు కార్డులు జారీ చేయడం జరుగుతుందన్నారు.

ఇళ్ల స్థలాలు చూపించండి

నంద్యాల(న్యూటౌన్): బొగ్గు లైన్ ప్రాంత ప్రజలకు ఇళ్ల స్థలాలు చూపించిన తరువాతనే ఖాళీ చేయించాలని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ కుమార్, నాగరాజు, పట్టణ కార్యదర్శి పుల్లా నరసింహులు అన్నారు. ఆదివారం నంద్యాల పట్టణంలోని బొగ్గులైన్ ప్రాంతంలో ఇళ్లు ఖాళీ చేయిండాన్ని వ్యతిరేకిస్తూ ధర్నా నిర్వహించారు. తక్షణమే బొగ్గులైన్ ప్రాంత వాసులకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో లక్ష్మణ్, సాయి, శివ, బన్ని, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయం చూపాలి

నంద్యాల(అర్బన్): దశాబ్దాలుగా బొగ్గులైన్ ప్రాంతంలోనే దినసరి కూలీలుగా స్థిర నివాసం ఏర్పర్చుకున్న వారిని ఉన్న ఫలంగా ఆ ప్రాంతం నుంచి వెళ్లాలనడం సరికాదని, ప్రత్యామ్నాయ మార్గాలు చూపిన తర్వాత వెళ్లమని చెబితే సరిపోతుందని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పులికొండన్న అన్నారు. ఆదివారం స్థానిక బొగ్గులైన్ ప్రాంత వాసులతో ఆయన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో స్థానికులు తిరుపతమ్మ, లలితమ్మ, నాగేంద్రమ్మ, సువర్ణ, ఈరమ్మ పాల్గొన్నారు.

మహిళలకు కొండంత 'ఆసరా'

- మాట నిలుపుకున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి
- టెక్నికల్ సమస్యతో నిలిచిన ఆసరా సొమ్ము విడుదలకు చర్యలు
- మూడేళ్ల ఆసరా సొమ్ములు ఒకే సారి జమ
- ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు రుణపడి ఉంటామన్న మహిళా సంఘాలు



ధన్యవాదాలు తెలుపుతున్న మహిళా సంఘాల ప్రతినిధులు

ఆళ్లగడ్డ : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పొదుపు మహిళలకు అందిస్తున్న వైఎస్సార్ ఆసరా సొమ్ము చిన్న చిన్న సాంకేతిక సమస్యలతో కొన్ని గ్రూపులు విడుదల కాలేదు. విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన చొరవతీసుకొని సమస్యలను పరిష్కరించి నగదును విడుదల చేయించారు. చాలా గ్రూపులకు మూడేళ్లకు సంబంధించిన ఆసరా సొమ్ము వారి ఖాతాల్లో జమ కావడంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డికి పొదుపు మహిళలు ధన్యవాదాలు తెలుపుతున్నారు.

ఇచ్చిన మాట ప్రకారం..

గత టీడీపీ ప్రభుత్వం డ్వాక్రా మహిళలను నిలువునా మోసగించింది. ఇచ్చిన హామీలను బుట్టదాఖలు చేసి ఎన్నికలకు నెల ముందు పసుపు, కుంకుమ పేరుతో దగా చేసింది. దీంతో పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయిన పొదుపు మహిళల దీనస్థితిని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాద యాత్ర సమయంలో గుర్తించారు. వారిని ఆదుకుంటానని హామీ ఇచ్చారు. ఈ మేరకు మేనిఫెస్టోలో పొందుపరిచినట్లు పొదుపు సంఘాల్లో ఉన్న మహిళలకు వరుసగా నాలుగు దఫాలుగా ఆసరా కింద బ్యాంకు రుణాలు మాఫీ చేస్తూ విశ్వసనీయతకు మారుపేరుగా నిలిచారు. అయితే చిన్నచిన్న సాంకేతిక సమస్యలతో కొన్ని గ్రూపులు ఆసరా సొమ్ములు విడుదల కాలేదు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి గ్రామాల్లో పర్యటిస్తున్న సందర్భంగా ఈ విషయం కొందరు మహిళలు ఆయన దృష్టికి తీసుకెళ్లడంతో.. సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట మేరకు అధికారులతో పాటు ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి సమస్యను పరిష్కరించడంతో అనేక గ్రూపులకు ఒకే సారి మూడు సంవత్సరాలకు సంబంధించిన ఆసరా సొమ్ములు వారి ఖాతాల్లో జమ అయ్యాయి.

పట్టణ పరిధిలో రూ.14.36 లక్షలు జమ

మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉండి ఆసరా పథకం అందని ఆళ్లగడ్డ పట్టణంలోని 11 స్వయం సహాయక సంఘాల మహిళలు శనివారం రూ 14.36 లక్షల ప్రభుత్వం విడుదల చేసింది. రుణమాఫీతో పాటు సున్నావడ్డీ డబ్బులు క్రమం తప్పకుండా సమయానికి జమ చేస్తుండటంతో మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మూడు సంవత్సరాల ఆసరా నిధులు ఒకే సారి విడుదలైన వివరాలు..

గ్రూపు	ఒకేసారి విడుదలైన ఆసరా నిధులు
శాంత	రూ 3,50,000
అనూష	రూ 3,00,000
మక్కా	రూ 4,00,000
ఐశ్వర్య	రూ 2,00,000
కృష్ణప్రియ	రూ 4,50,000
ఈశ్వర	రూ 5,00,000
శివనాగమునెమ్మ	రూ 4,99,000

రూ 4.59 లక్షలు జమయ్యాయి



మాది ఈశ్వర మహిళా సంఘం. మా గ్రూపు సభ్యులకు మూడు సంవత్సరాలకు పైగా వైఎస్సార్ ఆసరా సొమ్ములు అందలేదు. ఈ విషయం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మా ఇంటి దగ్గరకు వచ్చిన ఎమ్మెల్యే సార్‌కు చెప్పాం. ఆయన వెంటనే స్పందించి అధికారులతో మాట్లాడటంతో ఒకే సారి రూ. 4,59,141 జమ అయ్యాయి. ఈ డబ్బులు మా కుటుంబ అవసరాలకు ఎంతగానో ఉపయోగపడుతాయి. ఇక మాకు రావు అనుకున్న ఆసరా సొమ్ములు విడుదల చేయించిన ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు అండగా ఉంటాం.

– ఉమాదేవి, ఆళ్లగడ్డ

ఆసరా ఇక రాదు అనుకున్నాం



మాది అనూష పొదుపు గ్రూపు. అందరికీ మూడు విడుతలుగా ఆసరా సొమ్ములు జమ అవుతూనే ఉన్నాయి. మాకు మాత్రం కావడంలేదు. అధికారులకు ఎన్ని సార్లు విన్నవించుకున్నా ఫలితం లేదు. ఇక మనకు రాదు అనుకున్నాం. ఈ క్రమంలో ఎమ్మెల్యే అన్న దృష్టికి తీసుకు వెళ్లాం. ఆయన సానుకూలంగా స్పందించి ఆసరా అందని గ్రూపుల లిస్టు తెప్పించుకుని అధికారులతో చర్చించి సమస్యను పరిష్కరించడం జరిగింది. దీంతో మాకు రూ 3 లక్షలు విడుదల అయ్యాయి. సీఎం వైఎస్ జగనన్నకు, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటాం.

– చెన్నమ్మ, ఆళ్లగడ్డ

వ్యవసాయ విద్యుత్ వేళలు

ఉయ్యాలవాడ : మండలంలోని రైతులకు పగటిపూట 9 గంటలు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ గురప్ప తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి వారం రోజుల పాటు సుద్దమల్ల, మాయలూరు ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు ఇంజేడు, కొండుపల్లె, హరివరం, ఎస్.కొత్తపల్లె, అక్కంపల్లె ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు త్రీఫేజ్ విద్యుత్ అందిస్తున్నామని వివరించారు.

పేద విద్యార్థికి ఆర్థిక సాయం

శిరివెళ్ల: యర్రగుంట్లకు చెందిన స్నేహిత ఫౌండేషన్ చైర్మన్ సురేంద్రారెడ్డి ఆదివారం ఓ పేద విద్యార్థికి రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. నంద్యాల ఎస్‌వీఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో ద్వితీయ సంవత్సరం పాలిటెక్నిక్ విద్యార్థి దీప్తికి చదువు నిమిత్తం నగదును అందజేశారు. ఆయన మాట్లాడుతూ చదువుకు పేదరికం అడ్డు రాకూడదన్న ధ్యేయంతో తమ సంస్థ పేద విద్యార్థులకు అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఉషోదయ స్కూల్ ప్రిన్సిపాల్ ఉషారాణి పాల్గొన్నారు.

పెద్దమ్మకు ప్రత్యేక పూజలు

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. వేకువజామునుంచే మహిళలు పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం పెద్దమ్మకు అభిషేకాలు, హారతులు పట్టారు. భక్తులకు ప్రవేశం కల్పించి పెద్దమ్మ దర్శనం చేసుకోవడంతో పాటు మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

మీరే రేపటి విజయానికి వారధులు

- ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి
- జేసీఎస్ కన్వీనర్లు, గృహసారథుల సమావేశం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ : మరి కొన్ని రోజుల్లో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయానికి వారధులు మీరేనని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గంలోని జేసీఎస్ కన్వీనర్లు, గృహసారథులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి ఇంతవరకు దేశవ్యాప్తంగా పాలన కొనసాగించిన ఏ ప్రభుత్వం కూడా చేయని సంక్షేమ పథకాలు మన ప్రభుత్వము చేసిందన్నారు. ప్రతి కార్యకర్త తలెత్తుకుని తిరిగేలా మ్యానిఫెస్టోలో 98 శాతానికి పైగా అమలు చేసిన ఘణత మనీ జగనన్నది అన్నారు. మనం ఈ నాలుగున్నర ఏళ్లలో ఏం చేశామో అది ప్రతి కుటుంబానికి వివరించాలని సూచించారు. మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించుకునేందుకు కలిసికట్టుగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సలాం, రామతీర్థ పుట్టాలమ్మ చైర్మన్ గంగుల మనోహర్‌రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ ఎస్వీ జగన్మోహన్‌రెడ్డి, ఎంపీపీలు గజ్జల రాఘవేంద్రారెడ్డి, వీరభద్రుడు, అమర్‌నాథరెడ్డి, వసీం, పార్టీ పట్టణ, మండల కన్వీనర్లు పాల్గొన్నారు.

వృద్ధులను గౌరవిద్దాం



రిటైర్డు ఉద్యోగులను సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు

నంద్యాల(వ్యవసాయం): సమాజంలో వయో వృద్ధులను ప్రేమ, ఆదరాభిమానాలతో గౌరవిద్దామని రామకృష్ణ డిగ్రీ కళాశాల విద్యాసంస్థల అధినేత డాక్టర్ రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ప్రపంచ వయో వృద్ధుల సంక్షేమ దినోత్సవ కార్యక్రమం స్థానిక వివేకానంద ఆడిటోరియంలో సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన రిటైర్డు ఉద్యోగులకు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. అనంతరం నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ కైపరాముడు, లారెన్స్, మాధవస్వామి, సుబ్రమణ్యం, పీరయ్య, మహమ్మద్ ఖలీల్ పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ వయో వృద్ధుల దినోత్సవం

నంద్యాల(వ్యవసాయం): గ్రీన్ సొసైటీ ఆధ్వర్యంలో జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని ఆదివారం రైతునగర్‌లోని ప్రతిభా వయోవృద్ధుల ఆశ్రమంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వయోవృద్ధుల సమస్యలు– సంక్షేమం అనే అంశంపై సదస్సు నిర్వహించారు. సొసైటీ గౌరవాధ్యక్షుడు శ్రీనిధి రఘువీర్, అధ్యక్షుడు దండు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వృద్ధులకు బిస్కెట్లు, స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వృద్ధాశ్రమ నిర్వాహకులు నారాయణ, డీవీ సుబ్బయ్య, శేషఫణి, అన్నెం శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీమ సాగునీటి హక్కులకు పోరాడదాం



మాట్లాడుతున్న బొజ్జా దశరథ రామిరెడ్డి

నంద్యాల(సెంట్రల్): రాయలసీమ సాగునీటి వ్యవస్థపై ప్రజలంతా అవగాహన పెంచుకుని, న్యాయంగా రావాల్సిన నీటి వాటాల సాధనకు నడుం బిగించాలని రాయలసీమ సాగునీటి సాధనా సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథ రామిరెడ్డి పిలుపునిచ్చారు. రాయలసీమ సాగునీటి ప్రస్తుత పరిస్థితి అన్న అంశంపై పట్టణంలోని నేషనల్ పీజీ కళాశాలలో సమితి ఆధ్వర్యంలో విస్తృత స్థాయి సదస్సు నిర్వహించారు. సమితి ఉపాధ్యక్షుడు వైఎన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో వక్తలు మాట్లాడుతూ...రాష్ట్ర విభజన జరిగి పది సంవత్సరాలవుతున్నా, సీమలో కొత్త ప్రాజెక్టులు అటుంచి పాత, వాటికి మరమ్మతులు సైతం చేసుకోలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంత ప్రజలకు సాగునీటి రంగంలో జరుగుతున్న అన్యాయంపై యావత్తు సమాజం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సాగునీటి వ్యవస్థపై అవగాహన పెంచుకుని ఉద్యమాలు చేయాలని, దీనికోసం తాము రూపొందించిన అవగాహన పుస్తకంలోని అంశాలను ఈ నెల 3 నుంచి పక్షం రోజులు సోషల్ మీడియా ద్వారా విడుదల చేస్తున్నామన్నారు. సదస్సులో ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త స్వామినాథన్, రైతు నాయకులు ఎర్నేని నాగేంద్రనాథ్ మృతికి సంతాపం తెలిపారు.

సమితి ఆధ్వర్యంలో రాష్ట్రావతరణ దినోత్సవ కార్యక్రమం

అంతకుముందు రాయలసీమ సాగునీటి సాధన సమితి ఆధ్వర్యంలో స్థానిక సంజీవనగర్ గేట్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద రాష్ట్రావతర దినోత్సవాన్ని నిర్వహించారు. శ్రీబాగ్ ఒడంబడిక అమలుతోనే సీమకు న్యాయం జరుగుతుందని వెల్లడించారు. కార్యక్రమంలో ఏరువ రామచంద్రారెడ్డి, నిట్టూరి సుధాకర్ రావు, కొమ్మా శ్రీహరి, పట్నం రాముడు, రాఘవేంద్ర, షణ్ముఖ, కరిమద్దెల ఈశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా పింఛన్లు



ఉయ్యాలవాడలో పింఛన్ అందజేస్తున్న ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ



క్రిష్టిపాడులో వేకువ జామునే పుల్లమ్మ, దేవరాజులకు పింఛన్లను అందజేస్తున్న వలంటీర్ స్వాతి

ఉయ్యాలవాడ : కులం, మతం, రాజకీయాలతో పని లేకుండా అర్హతే కొలమానంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు మంజూరు చేస్తోందని ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ అన్నారు. ఆదివారం స్థానిక గ్రామ సచివాలయంలో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఎంపీడీఓ ఉమామహేశ్వర రావు మాట్లాడుతూ ఈ నెలకు సంబంధించి మండలానికి 3,957 పింఛన్లు మంజూరు కాగా రూ. 1,08,48,000లు నగదు ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జయరామిరెడ్డి, సర్పంచ్ మేకల ఓబులేసు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వేకువజాము నుంచే పంపిణీ

దొర్నిపాడు: మండలంలో వేకువజామునుంచే వైఎస్సార్ పింఛన్ కానుకను లబ్ధిదారుల చేతల్లో గ్రామ వలంటీర్లు పెట్టారు. తలుపు తట్టి నిద్రలేపి తెల్లారే సరికి పింఛన్లను అందజేశారు. తొలిరోజు 92 శాతం పైగా పూర్తి చేశారు. మండలంలో 3,756 పింఛన్లు ఉండగా 3,476 పింఛన్లను సాయంత్రానికి పూర్తి చేశారని ఎంపీడీఓ సుబ్బారెడ్డి తెలిపారు.



చెత్త బండిలో చెత్తను వేస్తున్న డీపీఓ మంజులవాణి



దొర్నిపాడులో శ్రమదానం చేస్తున్న ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి



ఉయ్యాలవాడలో హరితరాయబారులను సన్మానిస్తున్న ఎంపీపీ, అధికారులు

పరిసరాలను శుభ్రంగా ఉంచుకుందాం





ఎగువ అహోబిలం దేవాలయం ఆవరణలో చెత్త సేకరిస్తున్న అటవీ అధికారులు, నంద్యాల పట్టణంలో శ్రమదానం చేస్తున్న అధికారులు

నంద్యాల(అర్బన్)/(వ్యవసాయం): వ్యర్థాలను తొలగించి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకుందామని జిల్లా పంచాయతీ అధికారిణి మంజులవాణి పిలుపునిచ్చారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యతను ఇవ్వాలని కోరారు. స్వచ్ఛతా హీ సేవలో భాగంగా ఆదివారం నంద్యాల మండలంలోని పాండురంగాపురం, కానాల, అయ్యలూరు గ్రామాల్లో డీపీఓ యాప్రాన్‌ను ధరించి క్లాప్ మిత్రలతో కలిసి రహదారులను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా క్లాప్ మిత్రలు, సచివాలయ ఉద్యోగులు, గ్రామ ప్రజలతో గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకుంటామంటూ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమాల్లో గ్రామ సర్పంచ్‌లు దోలావతమ్మ, బావమ్మ, ఓబులేసుతో పాటు నాయకులు జగదీశ్వరరెడ్డి, విజయశేఖర్‌రెడ్డి, బసవేశ్వరరెడ్డి, పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో..

పట్టణంలోని నాల్గవ వార్డులో సచివాలయ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని బ్రహ్మానందీశ్వరస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ చింమగారి వేణుగోపాల్ హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ శివప్రసాదరెడ్డి, మెప్మా సీఎంఎం విజయభాస్కరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వెలాసిటి కళాశాల ఆధ్వర్యంలో ..

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని వెలాసిటి కళాశాల విద్యార్థులు స్వయంగా స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో పాల్గొన్నారు. కళాశాల పరిసర ప్రాంతాల్లో మొక్కలను శుభ్రం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, బీజేపీ నాయకులు మేడా మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకుందాం

నంద్యాల(సిటీ): పరిశుభ్రతే పరమావధి అని చెప్పిన మహాత్మా గాంధీ ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ స్వీయ పరిశుభ్రతతో పాటు పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని కల్పనా సెంటర్ నుంచి బైర్మల్ వీధిలో స్వచ్ఛత హి సేవా కార్యక్రమాన్ని యూనియన్ బ్యాంక్ ప్రతినిధులతో కలిసి నిర్వహించారు.

– కలెక్టర్ కార్యాలయ ఆవరణలో జరిగిన స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణ, సచివాలయ శానిటరీ సెక్రటరీలు, ఎస్పీవి అధికారులు పిచ్చి మొక్కలు, చెత్తను తొలగించి డంప్‌యార్డుకు తరలించారు.

సాంబవరంలో శ్రమదానం

గోస్పాడు: మండలంలోని సాంబవరం గ్రామంలో గ్రామ సర్పంచ్ ఐజయ్య, ఎంపీటీసీ సభ్యులు భారతి, వైఎస్సార్‌సీపీ నాయకుడు బొరెడ్డి శంకర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది గ్రామ ప్రజలతో కలిసి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, శ్రమదాన కార్యక్రమాన్ని చేపట్టారు. .

పరిశుభ్రత అందరి బాధ్యత

దొర్నిపాడు:పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని దీన్ని ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్వచ్ఛహిసేవా కార్యక్రమంలో భాగంగా అన్నీ ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ సచివాలయాలు పంచాయతీల్లో పిచ్చిమొక్కలు తొలగించి రోడ్లపై చీపుర్లు పట్టీ పరిసరాలను పరిశుభ్రం చేశారు. అలాగే అమ్మిరెడ్డినగరంలోని జీసీడీఓ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. జెడ్పీటీసీ శకుంతల, యాదవ కార్పొరేషన్ రాష్ట్రడైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతో పారిశుధ్యం

ఉయ్యాలవాడ : గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు ప్రజల భాగస్వామ్యంతో చేపట్టడంతో మంచి ఫలితాలు వస్తాయని మండలాధ్యక్షురాలు బుడ్డా భాగ్యమ్మ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక 24 గంటల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో పిచ్చి మొక్కలను తొలగించారు. పారిశుధ్య కార్మికులను(హరితరాయబారులు)ను, వాటర్‌మెన్ మాబుసాహెబ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మేకల ఓబులేసు, ఎంపీటీసీ సభ్యులు గగ్గెర వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.



శిరివెళ్లలో స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రుద్రవరంలో..

రుద్రవరం: స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో సర్పంచ్ బైరి విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఈఓ చెన్నయ్య, కార్యదర్శులు నాయక్, మౌనిక తదితరులు పారిశుద్ధ్య కార్మికులతో కలిసి పలు కాలనీల్లో రోడ్లను శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలస్వామి ఉన్నారు.

స్వచ్ఛతా హీ సేవ విజయవంతం

శిరివెళ్ల: మండలంలో ఆదివారం జరిగిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం విజయంతమైంది. మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బి.అబ్దుల్‌సలాం ఆధ్వర్యంలో కార్యకర్తలు గ్రామంలో వీధులను శుభ్రం చేశారు. అలాగే గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌ల ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఎర్రగుంట్ల మేజర్ పంచాయతీలో కార్యక్రమంలో ఎంపీడీఓ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

అందరి భాగస్వామ్యంతోనే స్వచ్ఛ అహోబిలం

ఆళ్లగడ్డ : దేవస్థాన సిబ్బంది, భక్తులు, గ్రామస్తులు అందరి సహకారంతోనే స్వచ్ఛ అహోబిలం సాకారమవుతుందని రుద్రవరం రేంజ్ అధికారి శ్రీపతినాయుడు అన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా అటవీ అధికారుల ఆధ్వర్యంలో ప్రముఖ పుణ్యక్షేత్రం అహోబిలం దేవస్థాన పరిధిలో ప్లాస్టిక్, చెత్తను ఏరివేశారు.

కేంద్రప్రభుత్వ విధానాలపై పోరాడుతాం

నంద్యాల(న్యూటౌన్): కేంద్రం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై సీపీఐ ఆధ్వర్యంలో పోరాటాలకు సిద్ధంగా ఉండాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో సీపీఐ నంద్యాల జిల్లా సమితి సమావేశం నిర్వహించారు. సీపీఐ కార్యదర్శి రంగనాయుడు ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిత్యావసర సరుకుల నుంచి పెట్రోల్, డీజిల్, గ్యాస్‌లు, విద్యుత్‌భారాలతో పేద ప్రజల నడ్డి విరుస్తున్నారన్నారు. పెంచిన ధరలను మోదీ ప్రభుత్వం వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐటీయూసీ కార్యదర్శి ప్రసాద్, సుబ్బరాయుడు, బాబాఫక్రుద్దీన్, ధనుంజయుడు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

నంద్యాల(న్యూటౌన్): ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో కరపత్రాలు విడుదల చేశారు. మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గా భవాని మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలన్నారు. మహిళలకు రాజకీయ రిజర్వేషన్ కల్పించాలని, మహిళా సమస్యలు పరిష్కరించాలని కోరారు. నవంబర్ 17,18,19 తేదిలలో నంద్యాల జిల్లాలో జరిగే ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నంద్యాల సీపీఐ జిల్లా కార్యదర్శి రంగ నాయుడు, బాబాఫక్రుద్దీన్, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి సుగుణమ్మ, తిరుపాలమ్మ, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

బైకులు ఢీ.. ఇద్దరికి గాయాలు

మహానంది: గాజులపల్లెలోని వైన్ షాపు సమీపంలో ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ఆదివారం ఇద్దరు యువకులు గాయపడ్డారు. గాజులపల్లెకు చెందిన బాషాతో పాటు మరొకరు, మహదేవపురం గ్రామానికి చెందిన బైక్‌లపై వెళ్తుండగా ఘటన చోటుచేసుకుంది. ఇద్దరికి తీవ్రగాయాలు కాగా వారిని చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.

నల్లమలలో దొంగల కోసం గాలింపు

మహానంది: మహానంది నుంచి గాజులపల్లె వెళ్లే మార్గంలో మహానందీశ్వరుడి భక్తుల వాహనాల నుంచి బ్యాగులను చోరీ చేసిన దారి దోపిడీ దొంగల కోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. మహానంది ఎస్ఐ నాగేంద్రప్రసాద్, పోలీసులు ఆదివారం రాత్రి వరకు నల్లమల అడవిలోని పాలేరువాగు, తెలుగు గంగ వంతెన తదితర ప్రాంతాల్లో అణువణువునా అన్వేషించారు. విశ్వసనీయ సమాచారం మేరకు పలు కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ మార్గంలో రాత్రి వేళల్లో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపించినా, బెదిరింపులకు పాల్పడినా సమీప గ్రామాల ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ విజ్ఞప్తి చేశారు.